జైకొడితే.. కడుపు నిండే..

- పార్టీల బల ప్రదర్శనకు పేదలే దిక్కు
- సభలు, సమావేశాలు, ర్యాలీలు.. ప్రతి దానికీ ఓ లెక్క..
- ఇంట్లో ఖాళీగా ఉండేకంటే.. అలా వెళ్లొస్తే.. ఇలా డబ్బులు..
- పేదల బస్తీలపై నేతల ఫోకస్..
- ఇంటి సరుకులకు డబ్బులు సరిపోతాయంటున్న పేదలు



మేడ్చల్‌రూరల్: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు బల ప్రదర్శన చూపించుకోవడం పరిపాటి. ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్ద ఎత్తున ర్యాలీలు చేపట్టి తామేమి తక్కువ కాదు అన్నట్లు పార్టీలు తమ జన బలాన్ని ప్రదర్శిస్తుంటారు. రాజకీయ పార్టీల బల ప్రదర్శనలు, ప్రచారాలు ప్రస్తుతం కొంత మంది పేద ప్రజలకు ఉపాధిగా మారింది. ఈ తరుణంలో కొందరు అన్ని పనులు వదులుకుని పార్టీల కార్యక్రమాలనే ఉపాధిగా ఎంచుకుంటుండగా మరికొంత మంది ఖాళీ సమయాల్లో రాజకీయ పార్టీల కార్యక్రమాలకు హాజరవుతూ డబ్బులు సంపాదిస్తున్నారు.

పేదలనే నమ్ముకుంటున్న ప్రధాన పార్టీలు..

మేడ్చల్‌లో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నువ్వా.. నేనా? అన్నట్లు వ్యవహరిస్తూ అదే స్థాయిలో తమ బలాన్ని ప్రదర్శించాలని భావిస్తున్నాయి. అందుల్లో భాగంగా అభ్యర్థులు పెద్ద ఎత్తున జనబలం ప్రదర్శిస్తూ ర్యాలీ, ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులపైనే ఆధారపడకుండా పేద, సామాన్య ప్రజలను నమ్ముకుంటున్నారు. ర్యాలీలో పాల్గొంటే ఒక రేటు, సమావేశంలో పాల్గొంటే మరో రేటు అన్నట్లు నిర్ణయించుకుని జనాలను పోగుచేస్తున్నారు. ఏ పార్టీ వారి కార్యక్రమమైనా మూడు లేదా నాలుగు గంటల్లో ముగుస్తుందిలే అనుకుంటున్న సామాన్యులు ఎంతో కొంత డబ్బులు పోగుచేసుకోవచ్చని భావిస్తున్నారు.

ఉపాధి మార్గంగా భావిస్తూ..

రాజకీయ పార్టీల ప్రచారంలో వారి కార్యకర్తలు ఒక వంతు ఉంటే అద్దెకు వచ్చే వారు మూడు వంతులు ఉంటున్నారు. ఎన్నికల సందర్భంగా గృహిణులు, వృద్ధులు, యువత ఉపాధి మార్గంగా ఎంచుకుని ప్రచారాలు, ర్యాలీలకు హాజరవుతున్నారు. రాజకీయ పార్టీలు ప్రచార ర్యాలీ నిర్వహించినా, సమావేశం నిర్వహించినా ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.500 వరకు చెల్లిస్తున్నారు. దీంతో ఇంటి వద్ద ఖాళీగా ఉండే బదులు ప్రచార కార్యక్రమాలకు వెళ్లి కాసేపు కాలక్షేపం చేస్తే చాలు డబ్బులు వస్తాయి అనే భావనలో మహిళలు, వృద్ధులు రాజకీయ పార్టీలు కార్యక్రమానికి పిలిచిన వెంటనే వెళ్తున్నారు. ఇక యువత తమకు ఉద్యోగం లేని రోజు, కళాశాల లేని రోజుల్లో ఇంటి వద్ద ఉండకుండా కార్యక్రమాల్లో పాల్గొంటే చేతి ఖర్చులకు డబ్బులు వస్తాయని భావిస్తూ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మహిళలు చంటి పిల్లలను ఎత్తుకొని మరీ కార్యక్రమాల్లో పాల్గొంటుండగా సరిగ్గా నడవలేని వృద్ధులు సైతం కర్ర సాయంతో ర్యాలీల్లో పాల్గొంటుండటం గమనార్హం.

ఓటు విలువ తెలుసుకోండి..

ఒకప్పుడు సామాన్యులు రాజకీయ పార్టీలు, నియోజకవర్గ అభ్యర్థులు తమ ప్రాంతానికి ఏం మేలు చేస్తారు, వారి మ్యానిఫెస్టో ఏమిటీ, తమకు ఏ విధంగా ప్రయోజనం చేకూరుతుందో తెలుసుకునేందుకు, వారు చెప్పే మాటలు వినేందుకు సామాన్య ప్రజలు పార్టీల సమావేశాలకు హాజరయ్యేవారు కానీ నేడు పరిస్థితి భిన్నంగా మారింది. రాజకీయ నాయకులు తమకు ఒరగబెట్టేది ఏమీ లేదులే అన్నట్లు భావిస్తూ ఎన్నికల సమయంలోనే వచ్చినంత డబ్బులు తీసుకుని పొదుపు చేసుకుందామనే విధంగా ప్రజలు మారిపోతున్నారు. సమావేశాలకు, ప్రచారాలకు హాజరై వారు ఇచ్చినంత డబ్బులు తీసుకుంటున్నారే తప్ప నాయకులు, అభ్యర్థులు తమకు ఏమి చేస్తారు.. తాము ఎవరిని ఎన్నుకుంటే తమ ప్రాంతం బాగుపడుతుందనే ఆలోచనలు చేయడం లేదు. ఇప్పటికైనా సామాన్యులు మేల్కొని ఓటు విలువను తెలుసుకుని ఓటు అనే అస్త్రంతో మంచి నాయకుడిని ఎన్నుకోవాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఏదీ ఏమైనా రాజకీయ పార్టీలు బలప్రదర్శనలు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు కొంత మంది సామాన్యులకు ఉపాధి మార్గంగా మారి వారి కుటుంబాల్లో కొంత మేర కష్టాలను తొలగిస్తున్నాయి.

కీసరలో బొడ్రాయి పూజలు ప్రారంభం



కీసర: కీసరలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ మహోత్సవ ప్రత్యేక పూజా కార్యక్రమాలు గురువారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, గోపూజ, దేవతస్థాపితపూజ తదితర పూజలను వెంపటి ప్రభాకర్‌శర్మ, సాయికిరణ్‌శర్మ, సందీప్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం బొడ్రాయిని గ్రామపురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్ దంపతులు, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా, ఉపసర్పంచ్ లక్ష్మణ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

ఘట్‌కేసర్: పట్టణంలోని విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించనున్నట్లు ఏఈ సతీశ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కబ్జాలపైనే మంత్రి మల్లారెడ్డి ధ్యాస
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్



శ్రీకాంత్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మహిళలు, పలు పార్టీలకు చెందిన నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 12, 13వ డివిజన్ల బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన పలువురు గురువారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ ప్రజలను మంత్రి మల్లారెడ్డి మోసం చేశారని, ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. మల్లారెడ్డికి కబ్జాలపై ఉన్న ధ్యాస, ప్రజలకు సేవ చేయాలని లేదన్నారు. 100 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ కళాశాల ఊసే లేదన్నారు. కాంగెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి వజ్రేష్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షులు మాట్ల వినాయ్‌కుమార్, రావుల ఐలయ్య, మల్లేష్‌చారి, మూర్తి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



జవహర్‌నగర్‌లో ప్రచారంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్

జవహర్‌నగర్: బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డిని గెలిపించాలని కోరుతూ జవహర్‌నగర్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గొడుగు వేణు, నాయకులు మహేష్, మాధవరెడ్డి, వెంకటేష్, శ్రీలత, సంధ్య, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

కన్నుల పండువగా స్వామివారి కల్యాణం



శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం మురహరిపల్లి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం గురువారం కన్నుల పండువగా సాగింది. ఆలయ చైర్మన్ అంతిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారిని పల్లకిపై ఊరేగింపుగా మండపానికి తీసుకెళ్లి కళ్యాణం నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్ భాస్కర్, ఉపసర్పంచ్ జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ శామీర్‌పేట మండల యూత్ అధ్యక్షుడు నర్సింహారెడ్డితో పాటు స్థానిక నాయకులు హాజరయ్యారు.

ఇన్ఫోసిస్‌ను సందర్శించిన 'అనురాగ్' విద్యార్థులు



ఇన్ఫోసిస్‌లో అనురాగ్ యూనివర్సిటీ ఏఐ విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్: పారిశ్రామిక సందర్శనలో భాగంగా వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఏఐ, ఏఐఎంఎల్ రెండో సంవత్సరం విద్యార్థులు గురువారం పోచారం మున్సిపాలిటీ ఇన్ఫోసిస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఐటీ పరిశ్రమ స్థాపన, నిర్వాహణ గురించి ఇన్ఫోసిస్ శిక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ బాలాజీ, వైస్ చాన్సలర్ రామచంద్రం, సీఈఓ నీలిమా, ఏఐ అధ్యాపకులు మనోరంజన్, సరళ, రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.


జేఎన్‌టీయూహెచ్ కబడ్డీ జట్టుకు ఎమ్మార్‌సీఈ విద్యార్థి



విద్యార్థి అనిల్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ అశోక్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాల విద్యార్థి జేఎన్‌టీయూహెచ్ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడు. కళాశాలలో సీఎస్ఈ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అనిల్ ఇటీవల నిర్వహించిన పోటీల్లో జేఎన్‌టీయూహెచ్ జట్టుకు ఎంపిక కాగా ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని జేఎన్‌టీయూ కాకినాడతో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీలో జేఎన్‌టీయూహెచ్ జట్టు తరఫున పోటీలో పాల్గొననున్నాడు. ఈ మేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, డైరెక్టర్ సుధీర్‌రెడ్డి, పీడీ మానస విద్యార్థి అనిల్‌ను అభినందించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు



చెక్‌పోస్ట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీఐ

మేడ్చల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు. ఇప్పటి వరకు మేడ్చల్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 54 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 4,671 లీటర్ల కల్లు, 196 లీటర్ల మద్యం, 21 లీటర్ల బీర్లు, 66 లీటర్ల ఎన్‌డీపీఎల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం పంపిణీ చేసినా ఇతర రాష్ట్రాల మద్యం కనిపించినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

ఉప్పల్ కేవీ-1లో జాతీయ స్థాయి పోటీలు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్‌లో ఉన్న కేంద్రీయ విద్యాలయ-1 జాతీయ స్థాయి అండర్-17 ఖోఖో పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ క్రీడోత్సవాలు స్కూలు ప్రాంగణంలో గురువారం ప్రారంభమయ్యాయి. వీటిని ప్రిన్సిపల్ ఈవీ రమణ సమక్షంలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సర్వేయర్ జనరల్ జీ.వరుణ్‌కుమార్ ప్రారంభించారు. దేశంలోని వివిధ కేంద్రీయ విద్యాలయాలకు చెందిన 17 ఏళ్లలోపు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ క్రీడాకారులతో పాటు వెంట వచ్చిన ఉపాధ్యాయులకు పాఠశాల ఆవరణలోనే బస ఏర్పాటు చేశారు. మొత్తం కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌లోని 25 రీజియన్ల నుంచి 350 మంది విద్యార్థులు, 50 మంది టీచర్లు వచ్చారు. సోమవారం వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ కేవీలకు చెందిన ప్రిన్సిపల్స్, పీఈటీలు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి రుణం తీర్చుకుంటా



రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి



రోడ్‌షో ప్రజలు

మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్/మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి అనుబంధ గ్రామం మైసమ్మగూడలో పుట్టి అన్ని రంగాల్లో పైకి వచ్చిన తాను వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే మొదటగా గుండ్లపోచంపల్లి రుణం తీర్చుకుంటానని బీఆర్ఎస్ మేడ్చల్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లిలో ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేవుడు తనకు అన్నీ ఇచ్చాడని.. దేవుడికే తాను బాకీ పడ్డానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల రూపంలో ఉండే దేవుళ్లకు అన్నిరకాలుగా సేవలు చేస్తానని అన్నారు. గుండ్లపోచంపల్లిని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, రాబోయే రోజుల్లో సింగపూర్‌గా మారుస్తామని అన్నారు. తాను మేడ్చల్ ప్రజలకు అన్నిరకాలుగా సేవలు చేశానని, తనకంటే ప్రజలకు సేవ చేసిన వారు ఉంటే వారికే ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్ నాయకులు నందారెడ్డి, దయాకర్‌రెడ్డి, విజయానందరెడ్డి, సంజీవ, మల్లిఖార్జున్‌ముదిరాజ్ దయానంద్‌యాదవ్, దయాకర్‌రెడ్డి, జహంగీర్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధికార దుర్వినియోగం చేస్తోంది

కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్



మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ నాయకులు పూర్తిగా అధికార దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆరోపించారు. మంత్రి తన ధన బలంతో ఓటర్లను మభ్యపెట్టేందుకు అధికార దుర్వినియోగం చేస్తూ అన్ని రకాల శక్తులను ఉపయోగిస్తున్నారని అన్నారు. మంత్రి ఆయన కుటుంబసభ్యులు కాలనీలు, గ్రామాల్లో ఇష్టానుసారంగా పార్టీల పేరుతో మద్యం ఏరులై పారిస్తున్నారని అధికారులు స్వేచ్ఛగా పని చేయలేకపోతున్నారని అన్నారు. మంత్రి, ఆయన సంతానం నియోజకవర్గంలో పార్టీలు ఏర్పాటు చేసి మద్యం, డబ్బులు పంచుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఎక్కడికక్కడే అధికార పార్టీ నాయకుల ఆగడాలను అడ్డుకుని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. పోలీస్‌శాఖ వారు, ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అధికార పార్టీ నాయకులు ఓటర్లను మభ్య పెట్టకుండా చూడాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో తమ కార్యకర్తలను అనవసరంగా వేధిస్తున్నారని మానుకోవాలని సూచించారు. మంత్రి కోడలు, కుమారుడు బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన మద్యం పార్టీపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆదరణ చూసి ..

ప్రచారంలో నియోజకవర్గవ్యాప్తంగా కాంగ్రెస్‌కు లభిస్తున్న ఆదరణ చూసి బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డికి ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ అన్నారు. తాను అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రచారం చేస్తుండగా అన్ని వర్గాల నుంచి తమకు మద్దతు లభిస్తోందని, ఆ మద్దతు చూసి బీఆర్ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని అన్నారు. ఓటమి భయాన్ని తట్టుకోలేక అధికార దుర్వినియోగం చేస్తూ అమలు కాని హామీలు ఇస్తూ తమ ధన బలంతో ఓటర్లను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు, రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తులు నియోజకవర్గంలో ఎందుకు తిరుగుతున్నారని వజ్రేష్ యాదవ్ ప్రశ్నించారు. ప్రజలు చైతన్య వంతులని వారు సరైన తీర్పు ఇస్తారని అన్నారు.

బావను హతమార్చిన బావమర్దులు



మృతిచెందిన మహమ్మద్ గౌసుద్దీన్

మేడ్చల్‌రూరల్: ప్లాటు తగాదాలతో సొంత బావను బావమర్దులు హతమార్చిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. సీఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బోధన్‌కు చెందిన శభానా బేగం పదేళ్ల క్రితం తల్లిదండ్రులతో కలిసి మేడ్చల్ మండలంలోని అక్బర్జాపేట్ గ్రామానికి వలస వచ్చి ఆర్ఎంపీ డాక్టర్‌గా పనిచేస్తోంది. కొన్నేళ్ల క్రితం లేబర్ కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్న మహమ్మద్ గౌసుద్దీన్(45) అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. తల్లిదండ్రుల సాయంతో శభానాబేగం 225 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి తండ్రి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంది. తల్లిదండ్రులు మరణించిన అనంతరం శామీర్‌పేట్‌లో నివాసముండే ఆమె సోదరులు సయ్యద్ లతీఫ్, సయ్యద్ అల్తాఫ్, సయ్యద్ ముబీన్‌ల మధ్య స్థలం విషయంలో గొడవ జరిగింది. పలుమార్లు వాగ్వాదం జరగడంతో సోదరులకు ఒక్కొక్కరికి 50 గజాల స్థలం ఇస్తానని శబానాబేగం అంగీకరించి హామీ ఇచ్చింది. రోజులు గడిచినా స్థలం ఇవ్వకపోవడంతో సోదరులు ఆమె భర్త గౌసుద్దీన్‌తో ఇటీవల వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే బుధవారం అర్ధరాత్రి గొడవకు పాల్పడి బావ గౌసుద్దీన్‌పై దాడికి పాల్పడ్డారు. ఒకరు కత్తితో పొడవగా.. మరొకరు తలపై కర్రతో దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావానికి గురైన గౌసుద్దీన్‌ను భార్య శభానాబేగం స్థానిక మెడిసిటీ ఆస్పత్రికి తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు మరణించినట్లు చెప్పారు. ఈ మేరకు మృతుడి భార్య శభానా బేగం ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి

బోడుప్పల్: బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని 18వ డివిజన్ కార్పొరేటర్ పులకండ్ల హేమలతారెడ్డి అన్నారు. శ్రీనగర్‌కాలనీ, విజయపురి కాలనీల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ నేతలు పులకండ్ల జంగారెడ్డి, ప్రమోద్‌కుమార్ కాలనీవాసులు పాల్గొన్నారు.



నామినేషన్‌లలో జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని, నామినేషన్లకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఎన్నికల సంఘం సూచనలు తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 13న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అదేరోజు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు.

ప్రచారానికి దరఖాస్తు చేసుకోవాలి

ఘట్‌కేసర్: ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ర్యాలీ, ప్రచార రథాలు, బహిరంగ సభ, వాహనాల ప్రదర్శన, రోడ్ షో, మిగతా ఎన్నికల ప్రచారానికి 48 గంటల ముందు రిటర్నింగ్ అధికారికి ఆఫ్‌లైన్, సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. 48 గంటల తర్వాత దరఖాస్తు చేసుకున్న వాటిని తిరస్కరిస్తామన్నారు. అనుమతి లేకుండా ప్రచారం చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆత్మీయంగా ఆల్‌సోల్స్ డే



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీ సమీపంలోని కీసర మండల క్రిస్టియన్ సెమెటరిలో గురువారం ఆల్ సోల్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ పల్లే, హర్షవర్ధన్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఫిలిఫ్ మాదాసు, ట్రెజరర్ రెవరెండ్ గాబ్రియల్, రెవరెండ్ డెవిడ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

4,500 కిలోల బెల్లం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బెల్లం, వాహనంతో సీఐ మల్లయ్య, సిబ్బంది

పోచారం: అక్రమంగా తరలిస్తున్న 4,500 కిలోల నల్లబెల్లం ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు, మల్కాజిగిరి టాస్క్‌ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టుకున్నారు. సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల నియమావళిలో భాగంగా మేడిపల్లి అపెక్స్ ఆస్పత్రి ఎదురుగా వాహనాలు తనిఖీ చేపట్టగా టీఎస్ 08 యూకే 2288 అశోక్ లీలాండ్ వాహనంలో 4,500 కిలోల బెల్లం లభించింది. డ్రైవర్‌ను విచారించగా బెల్లం సంబంధిచిన కొనుగోలు రశీదులు లేవన్నాడు. దీంతో వాహనం డ్రైవర్, ఓనర్ మేడిపల్లి పీఎన్టీ కాలనీకి చెందిన ఎస్‌కే మంజు, మేడిపల్లి ఎస్ఆర్ఎస్‌వీ అనెన్యూకు చెందిన రామభద్రయ్యను ఎక్సైజ్ నియమావళిని అనుసరించి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న బెల్లం విలువ రూ.22 లక్షలు ఉంటుందన్నారు. సీఐ మలయ్య, డీటీసీఐ భరత్ భూషన్, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి, శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ ప్రచారం



మేడ్చల్‌లో చైర్ పర్సన్ దీపికతో కలిసి ప్రచారం చేస్తున్న మంత్రి కోడలు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ అందరూ కలిసి విడివిడిగా తమ వార్డుల్లో ప్రచారాలు సాగించారు. ఓటర్లకు కరపత్రాలు అందజేసి కారుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో మంత్రి పెద్ద కోడలు శాలినిమహేందర్‌రెడ్డి, చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు దేవ, మహేష్, ఉమానాగరాజు, ప్రియ్కా మధుకర్‌యాదవ్, మానస శ్రవణ్‌కుమార్, కృష్ణవేణి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాన్యులకు న్యాయం

శామీర్‌పేట్: కాంగ్రెస్‌తోనే సామాన్యులకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మండలం కేశ్వాపూర్, ఉద్దమర్రి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలు, వాటి లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు దోసకాయ వెంకటేష్, బాల్‌నర్సింహ, లక్ష్మయ్య, వెంకటేష్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని గెలిపించాలని ప్రచారం



అవుషాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్: మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి చామకూర మల్లారెడ్డిని గెలిపించాలని అవుషాపూర్‌లో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్‌తో కలిసి గురువారం ప్రచారం చేశారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు, మంత్రి మల్లారెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. రైతుబంధు జిల్లా సభ్యుడు భిక్షపతిగౌడ్ శ్రీనివాస్‌గౌడ్ వీరేశం, దయాకర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

దోచుకోవడమే బీఆర్ఎస్ లక్ష్యం

మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: తెలంగాణలో కుటుంబ పాలన, దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పాలన సాగుతోందని, ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో గురువారం ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందన్నారు. మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ రూ.10 కోట్లతో గురుకుల్ ఆవరణలో డిగ్రీ కాలేజీ, స్థానికంగా వైద్యకళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ ఎంపీటీసీలు మహేశ్, రమేశ్, మాజీ ఉప సర్పంచ్ యాదగిరియాదవ్, బీఆర్ఎస్ మున్సిపల్ మాజీ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, ఈడబ్ల్యూఎస్ కాలనీ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి శశిధరన్, వెంకటయ్య, నాగభూషనం, సత్తిరెడ్డి, రవీందర్, ముత్యాలు, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.